క్లుప్తంగా

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జడ్చర్ల టౌన్: మాదన్నపేట పోలీసులు న్యాయవాది మహమ్మద్ సలీంపై దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేసే వరకు పోరాడతామన్నారు. శుక్రవారం సైతం విధులు బహిష్కరిస్తున్నామని.. న్యాయవాదులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాలిక్ షాకీర్, మహేశ్వర్‌రెడ్డి, శంకరాచారి, ఇఫ్తెకారుద్దీన్, పురుషోత్తం, యాదిరెడ్డి, మురళీ కృష్ణారావు, చల్లా రాములు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నవాబుపేట: కామారెడ్డిలో ఈ నెల 5న నిర్వహించనున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు రాంరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించడం తగదన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్‌కు కట్టుబడి పనిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎస్ మండల కార్యదర్శి నరేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నర్సింహులు, రఘురాంరెడ్డి, జెట్టి రాములు, భీమయ్య, నారాయణ, విఠల్‌రెడ్డి, శ్రీకాంత్, వెంకటేశ్వరప్ప, రాములు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ



రాజాపూర్: మిషన్ భగీరథ పథకం వాటర్‌మేన్లకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. నీటి నాణ్యత పరిశీలన, ప్లంబింగ్, పైప్‌లైన్, మోటార్ల మరమ్మతు తదితర అంశాలపై వాటర్‌మేన్లకు అవగాహన కల్పించి, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మచ్చేందర్, ఏఈ అభినవ్, ఎంపీఓ వెంకట్రాములు, కార్యదర్శి జ్ఞానేశ్వర్, మురళి, శివకుమార్ పాల్గొన్నారు.

నవాబుపేటలో నేటి నుంచి..

నవాబుపేట: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నుంచి వాటర్‌మన్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షమియుల్లా గురువారం తెలిపారు. మొదటి విడతగా 23 జీపీల మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జడ్చర్ల విద్యార్థి



జీవన్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ కో–ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థి జీవన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో వరంగల్ జిల్లాలో నిర్వహించే 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జీవన్ పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రఘురాం, రామకృష్ణగౌడ్‌లు జీవన్‌ను అభినందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

దేవరకద్ర: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన నరేష్ గతనెల 10న తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌ను గుర్తించి, రికవరీ చేశారు. గురువారం బాధితుడు నరేష్‌కు ఎస్‌ఐ నాగన్న సెల్‌ఫోన్ అందజేశారు.

బాగ్దాద్ షరీఫ్ యాత్రికుడికి సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం నుంచి బాగ్దాద్ షరీఫ్ యాత్రకు వెళ్తున్న ఆలిండియా సున్నీ ఉల్‌మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి, మతపెద్ద మౌలానా మొహసిన్‌పాషా ఖాద్రీని గురువారం పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ నూరుద్దీన్ హుస్సేని, సయ్యద్ హఫీజుద్దీన్, సయ్యద్ మహమూద్, మహ్మద్ ఖాజాఖాన్, మహ్మద్ మకీన్ అన్సారీ, మహ్మద్ హస్సాన్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనగర్ కాలనీ రాజరాజేశ్వరి ఆలయంలో..




బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో రేణుకా ఎల్లమ్మ



లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో..



ద్వారకామాయి దేవాలయంలో..



దేవరకద్రలో శైలపుత్రి అవతారంలో దుర్గామాత

జగజ్జననీ.. సదాస్మరామి

- భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- మొదటిరోజు వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు



జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వరకాలనీలో అమ్మవారి మండపం ఎదుట కోలాటం వేస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ, శ్రీద్వారకామాయి షిర్డీ సాయినాథుడి ఆలయం, వీరన్నపేట చౌడేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారికి అశేష పూజలు చేశారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోని శ్రీకామేశ్వరి సమేత ఐశ్వర్యేశ్వరాలయంలో అమ్మవారికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీనివాస కాలనీ శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ ఉన్నారు. బ్రాహ్మణవాడిలోగల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ఉమాదేవి రూపంలో దర్శనమిచ్చారు. అంతకుముందు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండ వెంకటేశ్ నివాసం నుంచి దేవాలయం వరకు అమ్మవారి ఆభరణాలు, పట్టు వస్త్రాలతో శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ జరిపారు. అమ్మవారిని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్నారు.

- జడ్చర్ల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయినగర్ సకలదేవతల ఆలయం, కావేరమ్మపేట చావిడి, గౌరీశంకర్‌కాలని, శ్రీనివాసనగర్, చైతన్యనగర్ బంగారు మైసమ్మ, గంగాపురం ఎల్లమ్మ, శ్రీగిరి క్షేత్రంలోని అష్టలక్ష్మి, లలితాంబికా దేవాలయాల్లో అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగిరి క్షేత్రంలో చండీహోమాలను ప్రారంభించారు.
- దేవరకద్ర పోచమ్మ దేవాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ధ్వజారోహణం చేశారు. అమ్మవారిని శైలపుత్రిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక దళితవాడలో కొలువుదీరిన అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా దర్శనమిచ్చారు.
- రాజాపూర్ మండల కేంద్రంతో పాటు చొక్కంపేట, రాయపల్లి, మల్లేపల్లి తదితర గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవారు శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- హన్వాడ మండల కేంద్రంతో పాటు కొత్తపేట, ఇబ్రహీంబాద్ తదితర గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.
- నవాబుపేట కన్యకా పరమేశ్వరి, లోకిరేవు వీరభద్రస్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.
- గండేడ్ మండలంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అధికారులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు దర్శించుకొని పూజలు చేశారు.



బాలత్రిపురసుందరిదేవిగా మైసమ్మ

నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు వేదమంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణం చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, కాకర్లపహాడ్ గ్రామస్తులు పర్వతాపూర్ మైసమ్మ సన్నిధికి కాలినడకన చేరుకొని పూలు, పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు గోపాల్, జగన్మోహన్‌రెడ్డి, కృష్ణయ్య, నర్సింహులు, మాధవులు, నరేందర్, శ్రీనివాస గుప్తా, బాలకిష్టయ్య పాల్గొన్నారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న భక్తులు



విశ్వేశ్వరాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం



రేణుకా ఎల్లమ్మకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర..



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..



జడ్చర్ల శ్రీగిరి క్షేత్రంలో..



రాజాపూర్ మండలం చొక్కంపేటలో..



హన్వాడలో..



గండేడ్ మండలం వెన్నాచేడ్‌లో..



జడ్చర్ల వాసవీ మాత ఆలయంలో..



జిల్లా కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న యువతులు



సారికా టౌన్‌షిప్‌లో..

ఘనంగా పూలపండుగ

జిల్లావ్యాప్తంగా గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఆటపాటలతో బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బతుకమ్మలతో చిన్నారులు

కులం పేరుతో దూషిస్తే సహించం

నవాబుపేట: ఎవరైనా కులం పేరుతో దూషిస్తే సహించమని ఆది జాంబవతి యువజన సంఘం సభ్యులు అన్నారు. మండలంలోని కాకర్లపహాడ్‌కు చెందిన ఓ యువకుడు కులం పేరుతో దూషించి అవమాన పరిచాడని గురువారం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి.. కులం పేరుతో దూషించడం నేరమని వివరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి అభిషేకం చేయించారు.

సమాజ సేవలో ముందుండాలి

నవాబుపేట: విశ్వకర్మలు మరింత చైతన్యవంతమై సమాజ సేవలో ముందుండాలని ఆ సంఘం నాయకుడు నర్సింహాచారి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో విశ్వకర్మల సమావేశం నిర్వహించారు. సంఘం బలోపేతానికి గాను మండల కేంద్రానికి చెందిన జేకే ట్రస్టు సభ్యుడు సుధాకరాచారి రూ. 56 వేల విరాళం అందజేశారు. సమావేశంలో వెంకటయ్య, వీరభోజయ్యాచారి, పాండురంగయ్య, శేఖరాచారి, బ్రహ్మం, శ్రీనివాస్, ఆనంద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జేపీఎన్‌సీఈలో ఆర్ట్ ఎగ్జిబిషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన, ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఆర్ట్ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ సుజీవన్, గురురాఘవేందర్, రాధిక, స్వాతి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు (టీఎఫ్‌డీసీ)కు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అందుకు సంబంధించిన పైలట్ సర్వేను గురువారం స్థానిక 37వ వార్డు పరిధిలోని సద్దలగుండు, రాజేంద్రనగర్‌లో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 88 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇక ఐఎన్‌టీయూసీ విద్యుత్ సంఘం (327) ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కుటుంబ సర్వే ఐదు రోజులపాటు కొనసాగుతుందని, అందరూ నమోదు చేయించుకోవాలని కోరారు. అనంతరం పలు మండపాల్లో దుర్గామాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పి.విజయ్‌కుమార్, కౌన్సిలర్లు స్వప్న, మునీరుద్దీన్, జాజిమొగ్గ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ తహసీల్దార్లు ఘన్సీరాం, సుందర్ రాజ్, కాంగ్రెస్ నాయకులు, విద్యుత్–327 సంఘం నాయకులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



గండేడ్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని.. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పగిడ్యాల్, బల్సూర్‌గొండ, పంచాంగల్ తండా, కొండాపూర్, మన్సూర్‌పల్లి, మన్సూర్‌పల్లి తండాల్లో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవన్న, ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, బాలయ్య, కృష్ణారెడ్డి, మన్నెపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే



చిన్నచింతకుంట: తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి చేపట్టిన కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ల్యాండ్ ఆక్విజేషన్ ప్రత్యేక కలెక్టర్ రాంరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం చిన్నచింతకుంట మండలం సీతారాంపేటలో అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డిజిటల్ గుర్తింపు కార్డుల జారీకి చర్యలు చేపట్టిందన్నారు. ఎలాంటి తప్పులకు తావివ్వకుండా సర్వే పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాస్ ఉన్నారు.

వరిలో చీడపీడలను నివారించాలి



గాధిర్యాల్‌లో వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ

మహమ్మదాబాద్: వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకటేష్ సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిపంటకు ఆశిస్తున్న చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరిలో కాండం తొలిచే పురుగు ఆశిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. వీటి నివారణ చర్యలను ఆయన రైతులకు వివరించారు. లింగాకర్షక బుట్టలను అమర్చాలని సూచించారు. పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి, అధిక దిగుబడులు సాధించాలని కోరారు.

ఉపవాసంతో దేవుడిని ప్రార్థిస్తే అద్భుతాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపవాసంతో యదార్థంగా దేవుడిని ప్రార్థిస్తే, ఆయన అద్భుతం చేస్తాడని అంతర్జాతీయ ప్రసంగికుడు కేవీ పాల్ అన్నారు. రెమా వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జేజీఆర్ గార్డెన్‌లో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి అధ్యక్షతన మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉపవాస ప్రార్థన పండగలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాస్టర్ కేవీ పాల్ హాజరై శక్తివంతమైన దేవుడి వ్యాఖ్యాన్ని అందించారు. అందరూ విశ్వాసంతో రాణించేందుకు వారంలో ఒక్కరోజు ఉపవాసంతో దేవుడిని ప్రార్థించాలని సూచించారు. దేవుడి వ్యాఖ్యాన్ని ధ్యానిస్తూ.. ఆయనకు ఇష్టులుగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే పరిస్థితులతో ఒత్తిడికి లోనుకాకుండా దేవుడిపై భారం వేసి ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఉపవాస ప్రార్థనల ప్రాముఖ్యతను తెలియజేసేందుకే మూడు రోజులపాటు ప్రార్థన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాస్టర్ పరంజ్యోతిని ప్రత్యేకంగా అభినందించారు. బెంగళూరుకు చెందిన జోయల్ బాబు ప్రత్యేక ఆరాధన భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం ప్రజల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు వేదాంతి, తిమోతి, చంద్రశేఖర్, సంఘ పెద్దలు దేవయ్య, శ్యాంసుందర్, భరత్, బల్‌రాం, లక్ష్మన్న, అనిల్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పాస్టర్ కేవీ పాల్

కందులు @ 10 వేలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో గురువారం లావాదేవీలు జోరుగా సాగాయి. మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన కందులకు ఈనామ్ టెండర్లు వేయగా.. క్వింటాల్ గరిష్ఠంగా రూ. 10 వేలు, కనిష్ఠంగా రూ. 9,700 ధరలు వచ్చాయి. ఆముదాలు క్వింటాల్ రూ. 5, 950 ధర పలికింది. మార్కెట్‌కు దాదాపు 200 బస్తాల కందులు, 50 బస్తాల ఆముదాలు అమ్మకానికి వచ్చాయి.

సమస్యలను పరిష్కరించాలి

కోయిల్‌కొండ: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ కాళప్ప అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా ఉపాధి హామీ పనుల వివరాలను తెలుసుకున్నారు. ఏపీఓ నర్సయ్య ఉన్నారు.

వివాహిత అదృశ్యం

నవాబుపేట: మండలంలోని మరికల్‌కు చెందిన వివాహిత పోశమల్ల భాను (21) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ విక్రమ్ గురువారం తెలిపారు. గతనెల 29న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిందని.. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. భర్త శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.